

# భాస్కరం భువనేశ్వరమ్

శ్రీ జ్యోశ్యుల శ్యామసుందరం,
తిలారు.

హైందవులకున్న ముఖ్యమైన పండుగలలో ''రథసప్తమి'' ఒకటి. ఇది మాఘ శుద్ధ సప్తమినాడు వస్తుంది. ఆ దినం సూర్యోదయ సమయంలో గ్రహ, నక్షత్రాల సన్నివేశం రథం ఆకారంలో ఉంటుంది. అందువల్లనే దీనికి రథసప్తమి అని పేరు వచ్చింది. సూర్యుణ్ణి ఆరాధించే పండుగగా ప్రసిద్ధి పొందినది. సూర్యగ్రహణంలో సమానమైనదిగా కూడా అంటారు.

సూర్యగ్రహణ తుల్యాసా
శుక్లమాఘస్య సప్తమీ
అరుణోదయ వేళాయాం
స్నానం తత్ర మహాఫలం.

భారతదేశంలో సూర్యారాధన వేదకాలం నుండి జరుగుచున్నది. ఋగ్వేద మందలి దశమ మండలంలో సూర్యప్రస్తుతి కన్పట్టుతుంది. వేదాలలో సూర్యుడు, ఆదిత్య, సవితృ, విష్ణు, మిత్ర మున్నగు పేర్లతో కన్పడతాడు. నభో మండలంలో సూర్యుడు మొదటి నక్షత్రం.

భారతీయులకు సూర్యభగవానుడు ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు ఉదయించే తూర్పు దిక్కు మనకు పరమ పవిత్రమైనది. కనుకనే ఆదిత్యుని ప్రత్యక్ష దైవంగా భావించి పూజిస్తారు. ఉదయం స్నానం అనంతరం అర్ఘ్య ప్రదానం చేయడం, మన భారతీయ సంప్రదాయం.

వేదసారమగు మహామంత్రముగా చెప్పబడుచున్న గాయత్రీ మంత్రములో సూర్యుడు మనకు సద్బుద్ధిని ప్రసాదించునని చెప్పబడినది.

ఉత్తరాయణం మకర సంక్రాంతి నుండి ప్రారంభమైనప్పటికి సూర్యుడు ఉత్తరదిక్కుగా వెళ్ళడం రథసప్తమి నుండే కనిపిస్తుంది. సూర్యుని రథం ఉత్తర దిశగా ఆనాడే తిరుగుతుందని కూడా కొందరి అభిప్రాయం.



ఫిబ్రవరి 8 రథసప్తమి సందర్భంగా ప్రచురిస్తున్నాం.

సూర్యప్రశంస పెక్కు పురాణాలలో కనపడుతుంది. మార్కండేయ పురాణంలో రాక్షసులు హవిర్భాగాలను దేవతలకు అందజేయకుండా చేసేవారు. అదితి ప్రార్థన కారణంగా సూర్యుడు మార్తాండుడు అన్న పేరుతో దానవ సంహారము చేసినట్లు తెలియుచున్నది. బ్రహ్మాండ పురాణంలో ఆంజనేయుడు, యాజ్ఞవల్కుడు సూర్యభగవానుని గురువుగా భావించి విద్యాభ్యాసాన్ని కొనసాగించినట్లు తెలియుచున్నది. ఒక్కొక్క మాసములో సూర్యుడు అతని గణములు ఒక్కొక్క పేరున వ్యవహరింపబడతారు. ద్వాదశ మాసములలో సూర్యుడు ద్వాదశ రూపాలలో కనిపిస్తూ, ద్వాదశాదిత్యులుగా వర్ణింపబడినారు.

సూర్యుడు విష్ణు స్వరూపుడు. శైవులు, వైష్ణవులు, శాక్తేయులు సూర్యమండలంలో తమ దేవతా మూర్తులున్నట్లు భావించి స్తుతిస్తారు. శ్రీరాముడు ఆదిత్య హృదయం పఠించి రావణాసురుని సంహరించినట్లు తెలుస్తున్నది. ఆది శంకరులు పంచాయతన పూజా విధానంలో శివ, విష్ణు, అంబిక, గణపతి మున్నగు వారితో పాటు స్ఫటికరూపమైన సూర్యుని కూడా చేర్చారు. జ్యోతి శ్యాస్త్రంలో సూర్య సిద్ధాంతం అగ్రగణ్యం.

సూర్యుని నిత్యం పూజిస్తే సకల రోగాలు నివారించబడి ఆయురారోగ్య ఐశ్వర్యాలు సిద్ధించునని మన పూర్వీకుల నుండి ఇప్పటి వరకు ఒక దృఢమైన విశ్వాసం మన ప్రజలలో వున్నది. పైగా ఉదయిస్తున్న సూర్యుని కిరణాలు శరీరం పైపడితే ఆరోగ్యానికి మంచిదనే విషయాన్ని నవీనులు కూడా అంగీకరించారు.

ఉదయం బ్రహ్మస్వరూపాయ
మధ్యాహ్నం తు మహేశ్వరః
అస్తమానే స్వయం విష్ణుః
త్రయమూర్తి దివాకరః

అని సూర్యుడు త్రిమూర్తి స్వరూపుడు కలవాడందురు.

మన పండుగలలో శ్రావణ శుద్ధ, షష్ఠి, బహుళ షష్ఠి ప్రసిద్ధములు. వీటిని సూర్యషష్ఠి అంటారు. మాఘ శుద్ధసప్తమి ''రథసప్తమి'' గా సుప్రసిద్ధము. కొందరికి రథసప్తమియే అసలు సంక్రాంతి. చిక్కుడు, రేగు కాయలతో రథాకారం చేసి సూర్యభగవానునికి క్షీరాన్నం నివేదన చేస్తారు. సప్తమి ఆదివారం అయితే భాను సప్తమిగా పవిత్రమైనదిగా భావిస్తారు. మాఘ మాసంలో స్త్రీలు, ఆదివారాలలో సూర్యుని ఆరాధన చేయటం శుభప్రదం అంటారు. సూర్యునికి అర్కపత్రం (జిల్లేడు ఆకులు) ప్రీతిపాత్రం.

హిందువులకు సూర్యోపాసన చేయటం శక్తిదాయకం పాండవులు వనవాస కాలంలో సూర్యుని ఆరాధించి అక్షయ పాత్ర సత్రాజిత్తుడు శమంతకమణిని వరంగా పొందారు. సూర్యుడు లోకసాక్షియై మానవులందరికి ఆరాధ్యుడైనాడు.

''చలి ప్రవేశించు నాగుల చవితినాడు
మెరయుమేసవి రథసప్తమి దినమున''

అని శ్రీనాథుడు వర్ణించినాడు.

దక్షుడు యజ్ఞ సమయంలో సూర్యునికి దంతాలు ఊడిపోయినందువలన క్షీరాన్నం, పండ్లు నివేదిస్తారు. ఏది ఏమైన మన పండుగలలో ఒక ప్రత్యేకతను సంతరించు కొనిన పండుగ రథ సప్తమి.

# జపము

**శ్రీ గుంటి శ్రీనివాస్**, గుళ్ళపల్లి

జపమన ఏదైన మంత్రముగాని భగవన్నామమునుగాని జపించుట. ఈ కలియుగమందు ఎక్కువమంది జనులు దృఢమైన శరీరము లేనివారు. అందువల్ల కఠినమైన హఠ యోగాభ్యాసములు చేయుట చాలా కష్టము. జపయోగము ఈశ్వర జ్ఞానమును సులభముగ పొందుటకుగల మార్గములలో ఒకటి. ధృవుడు, తుకారామ్, ప్రహ్లాదుడు, వాల్మీకి ఋషి, రామకృష్ణ పరమహంస, వీరందరు భగవన్నామ స్మరణవల్లనే ముక్తిని పొందిరి. యోగమునకు జపమొక ముఖ్యాంశము. అందువల్లనే గీతలో శ్రీకృష్ణుడు ''యజ్ఞానాం జపయజ్ఞోస్మి'' ''యజ్ఞము లన్నిటిలో నేను జపయజ్ఞమును'' అని చెప్పెను. ఈ కలియుగములో శాంతి, ఆనందము, చావు లేమిని ఇవ్వగలిగిన శక్తి జపమునకున్నది. జపము సహజముగ సమాధిస్థితి నివ్వగలిగియున్నది. జపమును సాత్త్విక భావముతోను, పరిశుద్ధమైన ప్రేమ శ్రద్ధలతోను చేయవలెను. అదొక అలవాటుగ మనము కోరెడి కోరికలను ఇవ్వగలిగి వున్నది.

జపమన మంత్రమును పునరావృత్తి చేయుట ధ్యానమన భగవంతుని, అతని గుణములలో కూడియున్న రూపమును ధ్యానించుట. ఇదే జపమునకు ధ్యానమునకు గల భేదము జప సహిత ధ్యానము, జపరహిత ధ్యానము అని ధ్యానములు 2 విధములు. జపము చేయునప్పుడు ఉచ్ఛస్థితికి రాగానే జపము తనంతటతానే ఆగిపోవును. అప్పుడు ధ్యానము మాత్రము మిగులును. అట్టి స్థితిని ఉచ్ఛస్థితికి వచ్చినవారు మాత్రమే పొందగలరు. నీవు ఏకాగ్రతను కూడ ప్రత్యేకముగ అభ్యసించ వచ్చును. నీకేది లాభకారిగ తోచిన దాని నభ్యసించ వచ్చును. ''ఓం'' మంత్ర జపము సగుణ, నిర్గుణ, బ్రహ్మోపాసకులకు పనికి వచ్చును. సగుణ బ్రహ్మోపాసకులు ''ఓం రామ'' యని కూడ జపించవచ్చు. నామ, రూపము లేవిధముగ విడదీయ రానివో, అదే విధముగ భావమును మాటను విడదీయ జాలము.

నీ వేదైన మంత్రమును జపించునప్పుడు మనస్ఫూర్తిగ నీ ఇష్ట దైవమును ప్రార్థించుచున్నట్లును, అతడు నే ప్రార్థనలను వినుచున్నట్లును, అతడు నీ వైపు దయార్ద్ర దృష్టితో చూచుచున్నట్లును, అతడు నీ కభయ దాన మిచ్చుచున్నట్లును, నీకు మోక్షము నివ్వవలెననెడి కోరికతో అతడు ఉన్నట్లు భావించు చుండుము. ఈ భావమును బాగుగ అలవరచుకొనుము.

భావసహితముగ జపించుము. జపించెడి మంత్రము యొక్క అర్థమును తెలిసికొనుము. ప్రతివస్తువు నందు, ప్రతి స్థలమందు అతడున్నట్లు అనుభవించుము. జపము చేయుచున్న కొలది నీ వతనికి దగ్గరయగుచున్నట్లు భావించుము ప్రతివారు జపముగాని నామస్మరణగాని భక్తి విశ్వాసములతో శ్రద్ధగలవారై చేయవలెను. అతని నామస్మరణమున అతని యందెట్టి ప్రేమ, భక్తి కలిగియుందువో అట్టి భావమునే ఎల్లప్పుడు కలిగి యుండవలెను.